ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తమిళనాడు
TAMILNADU

శనివారం 5 అక్టోబరు 2024

టైమ్‌పాస్ కోసం రాజకీయాల్లోకి రాలేదు

- మహానాడుతో మా సత్తా చాటుతాం
- టీవీకే నేత విజయ్ ప్రకటన



చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): పేరు ప్రఖ్యాతుల కోసమో, కాలయాపన కోసమో తాను రాజకీయప్రవేశం చేయలేదని ప్రజలతో మమేకమై వారికి సేవ చేయడం కోసమే రాజకీయాల్లోకి వచ్చానని తమిళగ వెట్రికళగం (టీవీకే) నేత, నటుడు విజయ్ పేర్కొన్నారు. విల్లుపురం జిల్లా విక్రవాండిలో ఈ నెల 27న జరుగనున్న తొలిమహానాడు సందర్భంగా అక్కడ శుక్రవారం మూహూర్త స్తంభ స్థాపన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆ సందర్భంగా విజయ్ పార్టీ శ్రేణులకు ఓ లేఖ రాశారు. పార్టీ శ్రేణులంతా పార్టీ తొలిమహానాడు ఎప్పుడు జరుగుతుందా అని నెలల తరబడి వేచి చూశారని, వారిని తాను, తనను వారు కలుసుకునే సమయం ఆసన్నమైందని తెలిపారు. పార్టీ శ్రేణులతో తన అనుబంధం కుటుంబ బంధం వంటిదని, తొలిసారిగా కార్యకర్తలకు లేఖ రాస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకోసం తీవ్రంగా పాటుపడాలని, వారి సమస్యలు దశాబ్దాలతరబడి అపరిష్కృతంగానే ఉన్నాయన్నారు. శుక్రవారం పార్టీ మహానాడు ముహూర్తస్తంభ స్థాపన కార్యక్రమం విజయవంతంగా ముగిసిందన్నారు. పార్టీ లక్ష్యాలను వెల్లడించేందుకే ఈ మహానాడును నిర్వహిస్తున్నామని తెలిపారు. రాజకీయాలు తెలుసునా అంటూ ప్రశ్నించిన వారందరూ ఈ మహానాడు తర్వాత ఆశ్చర్యపోవటం ఖాయమన్నారు. కార్యకర్తలంతా బాధ్యత కలిగిన పౌరులుగా, ఆదర్శపురుషులుగా ఉన్నవారినే ప్రజలు ఆదరిస్తారని, కార్యకర్తలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. మహానాడు ఏర్పాట్లు ప్రారంభమై, మహానాడు జరిగేంతవరకూ పార్టీ శ్రేణులు సైనికుల్లా ప్రవర్తించాలని, ఇతర పార్టీల కంటే తమిళగ వెట్రి కళగం భిన్నమైనదని నిరూపించాలన్నారు.

అట్టహాసంగా స్తంభస్థాపన...



విక్రవాండి వద్ద ముహూర్త స్తంభ స్థాపనలో పాల్గొన్న బుస్సీ ఆనంద్ తదితరులు


టీవీకే తొలి మహానాడు జరుగనున్న విక్రవాండి వి.సాలై వద్ద శుక్రవారం వేకువ జాము ముహూర్తస్తంభ స్థాపన పార్టీ ప్రధాన కార్యదర్శి బుస్సీ ఆనంద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. బుస్సీ ఆనంద్‌తో పాటు పార్టీ జిల్లా కార్యదర్శి భరణి బాలాజీ, ఖుషీ మోహన్, వడివేల్, న్యాయవాది అరవింద్, పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు మోహన్, విక్రవాండి స్థానిక నాయకుడు శేఖర్, కార్యదర్శి కామరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మెరీనా

- ఎయిర్ షో రిహార్సల్‌లో వైమానిక దళ విన్యాసాలు
- గొడుగులు వేసుకుని వీక్షించిన నగరవాసులు



వీక్షకులకు చేరువగా హెలికాప్టర్ల నుండి తాళ్లు పట్టుకుని దిగుతున్న సాహసికులు



కోస్ట్‌గార్డు నౌకపై హెలికాప్టర్ల విన్యాసాలను గొడుగులు పట్టుకుని వీక్షిస్తున్న నగరవాసులు

భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవాల సందర్భంగా ఈ నెల ఆరున మెరీనాతీరంలో వైమానిక విన్యాసాలు నిర్వహించనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన చివరి విడత ఎయిర్‌షో విన్యాసాలు చూపరులకు గగుర్పాటు కలిగించాయి. భారత వైమానిక దళం సభ్యుల ప్రతిభాపాటవాలకు నిలువెత్తు అద్దంలా మెరీనా తీరంలో బుల్లి విమానాల పల్టీలు, భూమి దద్దరిల్లేలా మిగ్ విమానాల శబ్దాలు, ఆకాశంలో త్రివర్ణ రంగవల్లులు వేసిన విమానాలు సైనికులు సాహసాలను వేలాదిమంది నగరవాసులు తిలకించారు. 21 సంవత్సరాల తర్వాత మళ్ళీ మెరీనాబీచ్‌లో ఈ విన్యాసాలు జరుగనుండటంతో నగరవాసులు ఆదివారం ఎయిర్‌షో వీక్షించడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

- చెన్నై, ఆంధ్రజ్యోతి



సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చెక్‌డ్యామ్‌లను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి

జల వనరుల అభివృద్ధి

రూ.83.19 కోట్లతో 19 పథకాలు

పనులు ప్రారంభించిన సీఎం స్టాలిన్



రూ.10వేల ఉపకార వేతనం అందుకున్న అర్చకుల పిల్లలు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జల వనరుల శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది జిల్లాల్లో రూ.83.19 కోట్లతో పూర్తయిన 19 పథకాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో తిరుప్పూరు జిల్లా తారాపురం తాలూకా గౌండయన్ వలసు గ్రామం వద్ద అమరావతి వాగుపై రూ.11.12కోట్లతో నిర్మించిన చెక్ డ్యామ్, పాంబాట్టి -పుంగతురై గ్రామం వద్ద అమరావతి వాగుపై రూ.11.56 కోట్లతో నిర్మించిన చెక్ డ్యామ్‌ను, కాంచీపురం జిల్లాలో కౌలపాక్కం గ్రామం నుండి పోయిచ్చకూరు రోడ్డు వరకూ రూ.11.72 కోట్లతో నిర్మించిన కాలువ, వాలాజాబాద్ తాలూకా ఉల్లావూరు గ్రామం సమీపం తొళ్లాయి మడుగుపై రూ.7 కోట్లతో నిర్మించిన వంతెనను ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. అదేవిధంగా ఉత్తిరమేరూరు తాలూకాలో చెక్ డ్యామ్, దిండుగల్ జిల్లా అయ్యంపాళయంలో మరమ్మతు చేసిన సాగునీటి కాలువ, కుళత్తూరు గ్రామంలో నిర్మించిన చెక్‌డ్యామ్, ఒట్టన్ సత్తిరం దాసరిపట్టి గ్రామంలో పాలాత్తు వాగుపై నిర్మించిన ఆనకట్టను కూడా సీఎం ప్రారంభించారు. ఇదే విధంగా రూ.26.70 కోట్లతో దిండుగల్ జిల్లాలో 2 చెక్‌డ్యామ్‌లు, ఆనకట్ట పునర్నిర్మాణం, తిరునల్వేలి జిల్లాలో రెండు చెక్ డ్యామ్‌లు, పెరంబలూరు జిల్లాలో 2 చెక్‌డ్యామ్‌లు, కోయంబత్తూరు జిల్లాలో చెక్‌డ్యామ్ తూత్తుకుడి జిల్లాలో 2 చెక్ డ్యామ్‌లు, తిరుచ్చిలో క్వాలిటీ కంట్రోల్ కార్యాలయ కొత్త భవనాన్ని ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ మంత్రి దురైమురుగన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, నీటివనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కే మణివాసన్, చీఫ్ ఇంజనీర్ ఎస్.మన్మథన్ తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల పిల్లలకు రూ.50లక్షల ఉపకారవేతనం...

సచివాలయంలో హిందూ దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏకకాల పూజకే పరిమితమైన ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకుల పిల్లల ఉన్నత విద్య కోసం తలా రూ.10వేల చొప్పున 500 మందికి రూ.50లక్షలను ముఖ్యమంత్రి స్టాలిన్ పంపిణీ చేశారు. ఈ విద్యా సహాయపథకం ప్రారంభ సూచనగా ఆయన ఐదుగురు విద్యార్థులు, ఐదుగురు విద్యార్థినులకు తలా రూ.10వేల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్ బాబు, పర్యాటక, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి పి.చంద్రమోహన్, హిందూ దేవాదాయ శాఖ కమిషనర్ పీఎన్ శ్రీధర్, అదనపు కమిషనర్లు డాక్టర్ ఇరా సుకుమార్, సి. హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పి.సుశీలకు ‘కలైంజర్ స్మారక అవార్డు’ ప్రదానం



సుశీలకు అవార్డును ప్రదానం చేస్తున్న సీఎం స్టాలిన్, చిత్రంలో మంత్రి స్వామినాథన్ తదితరులు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ సినీ నేపథ్యగాయని పి.సుశీలకు తమిళనాడు ప్రభుత్వం ఇటీవల 2023 సంవత్సరానికిగాను ప్రకటించిన 'కలైంజర్ ఆర్టిస్ట్ స్మారక అవార్డు'ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ శుక్రవారం ప్రదానం చేశారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఈ అవార్డును సుశీలకు ఆయన అందజేశారు. సినీ రంగానికి సుశీల చేసిన సేవలకుగాను ఆమెకు ప్రభుత్వం ఈ అవార్డును ప్రకటించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం సచివాలయానికి వచ్చిన సుశీలకు సీఎం స్టాలిన్ శాలువా కప్పి అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, రూ.10 లక్షల నగదు చెక్కును బహూకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమాచార, ప్రసార శాఖామంత్రి స్వామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి రాజారామన్, సమాచార శాఖ డైరెక్టర్ వైద్యనాథన్, గాయని పి.సుశీల కుటుంబ సభ్యులు ఉన్నారు.

సీఎం ట్రోఫీ పోటీల ప్రారంభం



పెరంబూర్, అక్టోబరు 4: స్థానిక నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రి ట్రోఫీ రాష్ట్రస్థాయి పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాల వారీగా క్రీడాకారుల గౌరవ వందనాన్ని ఉదయనిధి స్వీకరించారు. ఈ పోటీలు ఈ నెల 24వ తేది వరకు జరుగనున్నాయి.

లంక చెర నుంచి విముక్తి

- జైళ్ల నుంచి 50 మంది జాలర్ల విడుదల

పెరంబూర్, అక్టోబరు 4: శ్రీలంక జైళ్లలో ఉన్న 50 మంది జాలర్లకు ఎట్టకేలకు విముక్తి కలిగింది. వారిని ఆ దేశంలోని న్యాయస్థానాలు విడుదల చేశాయి. గత నెల పుదుకోట జిల్లా జయంకొండాం ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లిన 18 మంది జాలర్లను సరిహద్దులు దాటారంటూ లంక నావికాదళం అరెస్ట్ చేసి జైలుకు తరలించింది. జాలర్ల రిమాండ్ ముగియడంతో వారిని శుక్రవారం న్యాయస్థానం ఎదుట హాజరపరిచారు. కేసు విచారించిన న్యాయమూర్తి... 13 మంది జాలర్లు మళ్లీ శ్రీలంక సరిహద్దుల్లో ప్రవేశించి చేపలు వేటాడితే జైలు శిక్ష తప్పదని హెచ్చరించి వారిని విడుదల చేశారు. అలాగే, రెండో సారి చిక్కిన ఓ జాలరికి 18 నెలల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అదేవిధంగా సెప్టెంబరు 21వ తేది నాగపట్టణం, మైలాడుదురై జిల్లాలకు చెందిన 37 మంది జాలర్లను లంక నావికాదళం అరెస్ట్ చేసింది. వారి రిమాండ్ ముగియడంతో శుక్రవారం న్యాయమూర్తి ఎదుట హాజరుపరచగా, 37 మంది జాలర్లను విడుదల చేశారు. విడుదలైన జాలరులంతా ఒకటీ రెండు రోజుల్లో స్వస్థలాలకు చేరుకుంటారని మత్స్యశాఖాధికారులు తెలిపారు.



చెన్నై టి.నగర్ టీటీడీ దేవస్థానం పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన శ్రీవారి శేషవాహన సేవలో పాల్గొన్న స్థానిక సలహామండలి మాజీ అధ్యక్షులు ఏజే శేఖర్, ఎన్.శ్రీకృష్ణ, ఆనంద కుమార్‌రెడ్డి, మాజీ సభ్యులు మోహన్‌రావు, కృష్ణారావు, రాధాకృష్ణ, ఏఈవో పార్థసారథి తదితరులు

సమాచార దర్శిని

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, అక్టోబరు 4: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గిండి, అన్నానగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

గిండి: లేబర్ కాలని, గిండి ఇండస్ట్రియల్ ఎస్టేట్, టీఎస్, మినీ టీఎస్, బాలాజి నగర్, నాగిరెడ్డి గార్డన్, ఈకాట్టుతాంగళ్, గాంధీ నగర్ మెయిన్ రోడ్డు, సర్దార్ కాలని, జేఎన్ రోడ్డు, కలైమగళ్ నగర్, అచ్యుతన్ నగర్ 1వ మెయిన్ రోడ్డు, అరులయంపేట సౌత్ ప్రాంతం, ముత్తారమ్మన్ వీధి కొంత భాగం, గణపతి కాలని, లాజర్ వీధి, గిండి.

అన్నానగర్: జె బ్లాక్, వైగై కాలని, 13వ మెయిన్ రోడ్డు, వళ్లలార్ రెడిడెన్స్, తంగం కాలని, 17వ మెయిన్ రోడ్డు, తిరువళ్లువర్ రెసిడెన్స్, తిరుమూలర్ కాలని, 18వ మెయిన్ రోడ్డు, మలర్ కాలని, కంభర్ కాలని, 19వ మెయిన్ రోడ్డు, తెన్రల్ కాలని, హెచ్ 15 బ్లాక్ రోడ్డు, మెయిన్ రోడ్డు, ఏబీ ఫ్లాట్, సి సెక్టార్, డబ్ల్యూ బ్లాక్, ఇమయం కాలని, కైలాష్ కాలని.

తరమణి: ఎంజీఆర్ రోడ్డు కొంత భాగం, సందియప్పన్ రోడ్డు, కోదండరామన్ వీధి, పెరుంగుడి కల్లుకుట్టై ప్రాంతం, ఓఎంఆర్ ప్రాంతం, కామరాజర్ నగర్, కురింజి నగర్, అన్నా హైరోడ్డు, నెహ్రూ నగర్ కొట్టివాక్కం ప్రాంతం, శీనివాస నగర్, జయేంద్ర కాలని, తిరువళ్లువర్ వీధి, కర్పగ వినాయకర్ వీధి, టెలిఫోన్ కాలని, చర్చ్ రోడ్డు, సీబీఐ కాలని.

19లోగా బాణసంచా దుకాణాలకు దరఖాస్తులు

పెరంబూర్, అక్టోబరు 4: దీపావళి పండుగ సందర్భంగా రాష్ట్రంలో బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేసే వ్యాపారులు ఈ నెల 19వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని రెవెన్యూ శాఖ కమిషనర్ ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ కోసం వ్యాపారులు తాత్కాలికంగా దుకాణాలు ఏర్పాటుచేసి టపాసులు విక్రయిస్తుంటారు. దుకాణాలు ఏర్పాటుచేయగోరు వ్యాపారులు https://www.tnesevai.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అర్హత కలిగిన వారికి లైసెన్స్ అందిస్తామని ప్రభుత్వం తెలిపింది.

రేపు కీల్పాక్కంలో సేంద్రియ రైతు బజార్

పెరంబూర్, అక్టోబరు 4: తమిళనాడు సేంద్రియ వ్యవసాయ సమాఖ్య, చెన్నై ఆర్గానిక్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో కీల్పాక్కంలో సేంద్రియ రైతు బజార్ జరుగనుంది. సీఎస్‌ఐ బెయిన్ పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేంద్రియ పద్ధతిలో రైతులు పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పారంపర్య బియ్యం, చిరుధాన్యాలు, నిత్యావసర సరుకులు విక్రయించనున్నారు. కాగా, ప్లాస్టిక్ సంచులపై నిషేధం కారణంగా కొనుగోలుదారులు గుడ్డ సంచులు తీసుకురావాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

నాలుగు రోజులు పాస్‌పోర్ట్ సేవలకు అంతరాయం

పెరంబూర్, అక్టోబరు 4: పాస్‌పోర్ట్ సేవల వెబ్‌సైట్ శుక్రవారం రాత్రి 8 నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు పనిచేయదని ప్రకటన వెలువడింది. వెబ్‌సైట్‌లో ఏర్పడిన సాంకేతికలోపం కారణంగా సేవలకు అంతరాయం కలుగుతుందని, తదుపరి నిర్వహించే ఇంటర్వ్యూ తేది అభ్యర్థుల సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపనున్నట్లు పాస్‌పోర్ట్ కార్యాలయం తెలియజేసింది.

తాంబరం-కొచ్చువెలి వారాంతపు రైళ్లు

పెరంబూర్, అక్టోబరు 4: ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-కొచ్చువెల్లి-తాంబరం మధ్య వారాంతపు ఏసీ రైళ్ల నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06035 తాంబరం-కొచ్చువెలి వారాంతపు ఏసీ ప్రత్యేక రైలు నెల 11,18,25, నవంబరు 1,8,15,22,29, డిసెంబరు 6,13,20,27 (శుక్రవారం) తాంబరంలో రాత్రి 7.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 11.30 గంటలకు కొచ్చువెలి చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06036 కొచ్చువెలి-తాంబరం వారాంతపు ప్రత్యేక ఏసీ రైలు ఈ నెల 13,20,27, నవంబరు 3,10,17,24, డిసెంబరు 1,8,15,22,29 తేదీలు (ఆదివారం) మధ్యాహ్నం 3.25 గంటలకు కొచ్చువెలిలో బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.30 గంటలకు తాంబరం చేరుకుంటుంది. ఈ రైళ్ల ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైందని దక్షిణ రైల్వే తెలిపింది.

ఓటర్ల జాబితాలో పేర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

పెరంబూర్, అక్టోబరు 4: ఓటరు జాబితాలో పేర్లు నమోదుకు నవంబరు 9,10,23,24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని అన్ని జిల్లాల కలెక్టర్లకు రాష్ట్ర ఎన్నికల అధికారి సత్యప్రద సాహు లేఖ రాశారు. ప్రత్యేక శిబిరాలకు అవసరమైన ఓటరు జాబితా సిద్ధంగా ఉంచుకోవాలని, 2025 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు పూర్తిచేసుకొనే వారు ఓటరు జాబితాలో తమ పేరు నమోదుచేసుకోవచ్చని ఆయన తెలిపారు.

జల్ జీవన్ కనెక్షన్లకు నెలకు రూ.30 ఛార్జీ

పెరంబూర్, అక్టోబరు 4: కేంద్ర ప్రభుత్వ జల్ జీవన్ పథకంలో, రాష్ట్రంలోని గ్రామాల్లో గృహాలకు తాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించగా, ప్రస్తుతం కోటి ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చారు. ఈ పథకానికి తొలివిడతగా రూ.3,249 కోట్లు, రెండవ విడతగా రూ.3,307 కోట్లు కేటాయించారు. ఈ పనులు 2025 మార్చిలోగా పూర్తి చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. ఈ నేపథ్యంలో, తాగునీటి సరఫరా, పర్యవేక్షణ పనుల కోసం జల్ జీవన్ కనెక్షన్ పొందిన గృహాల నుంచి నెలకు రూ.30 ఛార్జీ వసూలుచేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

కూడన్‌కుళంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

పెరంబూర్, అక్టోబరు 4: కూడన్‌కుళం అణు విద్యుత్ కేంద్రంలోని మొదటి యూనిట్‌లో శుక్రవారం నుంచి విద్యుదుత్పత్తి ప్రారంభమైంది. ఈ యూనిట్‌లో సాంకేతికలోపం కారణంగా ఈ నెల 1వ తేది ఉత్పత్తి నిలిపివేశారు. మరమ్మతులు పూర్తికావడంతో శుక్రవారం నుంచి ఉత్పత్తి ప్రారంభించినట్లు, తొలుత 500 మెగావాట్లు ఉత్పత్తి చేయగా, సాయంత్రానికి 1,000 మెగావాట్లకు పెంచారు. కాగా, ఈ కేంద్రంలోని 2వ యూనిట్‌లో 1,000 మెగావాట్ల ఉత్పత్తి కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

ఈరోడ్‌లో ఇద్దరికి రాట్ ఫీవర్

పెరంబూర్, అక్టోబరు 4: ఈరోడ్ జిల్లా అమ్మాపేట సమీపం పూనాచ్చి ప్రాంతంలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ఇద్దరికి రాట్ ఫీవర్ లక్షణాలు నిర్ధారణ అయ్యాయి. బిబిన్ కుమార్, భరణీత్తర్ తదితరులు రాట్ ఫీవర్ లక్షణాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా, జిల్లాలో ఇప్పటివరకు నలుగురికి రాట్ ఫీవర్ సోకగా ఒకరు మృతి చెందినట్లు జిల్లా ఆరోగ్య శాఖ తెలిపింది.

దోమల నిర్మూలనకు జీసీసీ చర్యలు

- రూ.67లక్షలతో ఫాగింగ్ యంత్రాలు



కార్పొరేషన్ కార్మికులకు ఫాగింగ్‌యంత్రాలను అందజేస్తున్న మంత్రి కేఎన్ నెహ్రూ

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఈశాన్య రుతు పవన ప్రభావిత వర్షాల కారణంగా వరదలు సంభవిస్తే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు సన్నద్ధమవుతున్నారు. 36 పడవలను కొనుగోలు చేసిన అధికారులు తాజాగా రూ.67 లక్షలతో 100 ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. వర్షాలు కురిస్తే నగరమంతటా దోమల బెడద పెరిగే అవకాశం ఉండటంతో ముందస్తు చర్యల్లో భాగంగా దోమలను నిర్మూలించేందుకు కొత్త ఫాగింగ్ యంత్రాలను ఉపయోగించనున్నారు. రిప్పన్‌భవనం ప్రాంగణంలో శుక్రవారం ఉదయం జరిగిన కార్యక్రమంలో నగర పాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూ కొత్త ఫాగింగ్ యంత్రాలను క్షేత్ర శ్రామికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పల్లపు ప్రాంతాల్లోచేరే వాననీటిని తొలగించేందుకు 990 మోటరు పంపులు కూడా సిద్ధం చేసినట్లు చెప్పారు. నగరమంతటా వరద బాధితులను సంరక్షించడానికి 162 సహాయక కేంద్రాలు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు. గోపాలపురంలోని కార్పొరేషన్ వంటశాలలో గంటకు 1500 మందికి ఆహారపదార్థాలు తయారు చేసేందుకు కిరాణా సరకులను కూడా సిద్ధం చేసామని నెహ్రూ చెప్పారు. 15 జోన్లలోనూ వరద పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఐఏఎస్ అధికారులను కూడా నియమించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఆర్.ప్రియ, డిప్యూటీ మేయర్ ఎం.మహేష్‌కుమార్, కమిషనర్ జే కుమారగురుబరన్, అదనపు కమిషనర్ (ఆరోగ్యం) డాక్టర్ వి.జయచంద్ర భానురెడ్డి, స్టాండింగ్ కమిటీ చైర్మన్లు డాక్టర్ కె.శాంతకుమారి, డి.ధనశేఖరన్, పాలవాక్కం డి.విశ్వనాధన్ తదితరులు పాల్గొన్నారు.

20 సెం.మీ వర్షం కురిసినా ఎదుర్కొనేందుకు సిద్ధం

- జీసీసీ కమిషనర్ కుమరగురుపరన్

పెరంబూర్, అక్టోబరు 4: రాజధాని నగరం చెన్నైలో 20 సెం.మీ వర్షపాతం కురిసినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) కమిషనర్ కుమరగురుపరన్ తెలిపారు. ఈ మేరకు ఆయన నగరంలో మీడియాతో మాట్లాడుతూ... ఈశాన్య రుతుపవనాల సీజన్ ప్రారంభానికి ముందే వర్షపు కాలువల నిర్మాణం, పూడికతీత తదితర పనులు చేపట్టామన్నారు. ప్రస్తుతం 3,040 కి.మీ వర్షపు కాలువల నిర్మాణాలు పూర్తికాగా, మరో 1,150 కి.మీ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. ఈ పనులు పూర్తయితే నగరంలో భారీవర్షం కురిసినా వర్షపు నీరు సులభంగా సముద్రంలోకి వెళ్లేలా చర్యలు చేపట్టామని తెలిపారు. అలాగే తమ పనులకు రోడ్లు తవ్వరాదని ఇతర శాఖలకు ఇదివరకే ఉత్తర్వులు జారీచేశామని కమిషనర్ తెలిపారు.

ప్రయాణికులు లేక పది విమానాల రద్దు

పెరంబూర్, అక్టోబరు 4: తగినంతమంది ప్రయాణికులు లేకపోవడంతో నగరంలో 10 విమాన సేవలు శుక్రవారం రద్దయ్యాయి. చెన్నై నుంచి ఉదయం 7.45 గంటలకు అండమాన్ వెళ్లాల్సిన ఆకాషా ఎయిర్‌లైన్స్, 11.20 గంటలకు శ్రీలంక వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా, మధ్యాహ్నం 1.20 గంటలకు బెంగళూరు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా, 1.20 గంటలకు బెంగళూరు వెళ్లాల్సిన ఆకాషా ఎయిర్‌లైన్స్ విమానాలు రద్దయ్యాయి. అలాగే, ఉదయం 7 గంటలకు బెంగళూరు నుంచి వచ్చే విమానం, మధ్యాహ్నం 12 గంటలకు ముంబై నుంచి రావాల్సినది, 1 గంటకు అండమాన్ నుంచి రావాల్సినది, 2,45 గంటలు మదురై నుంచి రావాల్సిన విమానాలు తగినంత మంది ప్రయాణికులు లేకపోవడంతో రద్దయ్యాయి. ఈ విమానాల్లో ప్రయాణించేందుకు టిక్కెట్లు రిజర్వ్ చేసుకున్న ప్రయాణికులు వేరే విమానంలో పంపించారు.

రూ.10 నాణేం తీసుకోకుంటే చర్యలు

- కాంచీపురం కలెక్టర్ హెచ్చరిక

పెరంబూర్, అక్టోబరు 4: రూ.10 నాణేలు తీసుకోని దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు చేపడతామని కాంచీపురం జిల్లా కలెక్టర్ కలైసెల్వి హెచ్చరించారు. దేశవ్యాప్తంగా రూ.10 నాణేలు చెలామణిలో ఉండగా, ఇవి చెల్లవంటూ వ్యాపారులు వాటిని తీసుకొనేందుకు నిరాకరిస్తున్నారు. ఈ విషయమై రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పందిస్తూ... పలు గ్రామాల్లో రూ.10 నాణేలు చెల్లవని వ్యాపారులు తీసుకొనేందుకు నిరాకరిస్తున్నారని, ప్రభుత్వం అంగీకరించిన నాణేలను తీసుకోకపోవడంతో చట్టప్రకారం నేరమని పేర్కొంది. ఈ క్రమంలో, కాంచీపురం జిల్లాలో రూ.10 నాణేలు తీసుకోని వ్యాపారాలపై చట్టపరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

కోవైలో ఆర్మీ ఇండస్ట్రియల్ పార్క్

- పర్యావరణ కమిషన్ అనుమతి

పెరంబూర్, అక్టోబరు 4: కోయంబత్తూర్ సూలూరు ప్రాంతంలో ఏర్పాటుకానున్న ఆర్మీ ఇండస్ట్రియల్ పార్క్‌కు తమిళనాడు ఎన్విరాన్‌మెంటల్ అసెస్‌మెంట్ కమిషన్ అనుమతులు జారీచేసింది. రూ.260 కోట్లతో కోవై జిల్లా సూలూరు వారప్పాడి పంచాయతీలో ఆర్మీ ఇండస్ట్రియల్ పార్క్ 370 ఎకరాల్లో ఏర్పాటుకానుంది. ఈ పార్క్ ఏర్పాటుతో సుమారు 10,000 మందికి ఉపాధి లభించే అవకాశముంది. ఈ నేపథ్యంలో, సూలూరు తాలూకా పరిధిలోని వారపట్టాడి, కందంపాళయం, సడయంజచెట్టిపాళయం, పూజారి పాళయం, వి.చంద్రాపురం, కుళత్తుపాళయం, పులియమరత్తుపాళయం తదితర గ్రామాల్లో 421 ఎకరాల విస్తీర్ణంలో తమిళనాడు పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆర్మీ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటుకానుంది.

సేతు ఎక్స్‌ప్రెస్ రైలింజన్ నుంచి పొగలు

అడయార్, అక్టోబరు 4: రామేశ్వరం నుంచి చెన్నై వస్తున్న సేతు ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో ఆకస్మికంగా పొగలు వచ్చాయి. దీన్ని గమనించిన లోకోపైలెట్ రైలు నిలిపివేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ గురువారం రాత్రి 8.50 గంటలకు రామేశ్వరం నుంచి చెన్నై బయలుదేరింది. అర్ధరాత్రి 12.20 గంటల సమయంలో పుదుక్కోట జిల్లా వెల్లనూరు - నార్తామలై ప్రాంతంలో ఒక్కసారిగా ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. గమనించిన లోకోపైలెట్ రైలును నిలిపివేశారు. సమాచారాన్ని రైల్వే అధికారులకు చేరవేయగా, మరో ఇంజిన్ సాయంతో సేతు ఎక్స్‌ప్రెస్‌ను చెన్నై పంపించారు. ఈ కారణంగా రైలు 45 నిమిషాల పాటు అక్కడే ఆగిపోయింది.

డీఎంకే అవినీతిని వెలికితీస్తాం..!

- బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త హెచ్.రాజా

పెరంబూర్, అక్టోబరు 4: రాష్ట్రంలో రాబోయే 2026 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటవుతోందని, అప్పుడు డీఎంకే అవినీతి చిట్టా బయటకు తీస్తామని బీజేపీ రాష్ట్ర సమన్వయకర్త హెచ్.రాజా తెలిపారు. తిరునల్వేలి పార్టీ కార్యాలయంలో శుక్రవారం తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి జిల్లాలో పార్టీ నిర్వాహకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ... చెన్నై మెట్రో ప్రాజెక్ట్‌కు రూ.63,246 కోట్లు అందించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు. రాష్ట్రానికిరూ.10.60 లక్షల కోట్ల పథకాలకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని రాజా తెలిపారు.

కావేరి మిగులు జలాల కోసం ధర్మపురిలో పీఎంకే బంద్

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): కావేరి మిగులు జలాల పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పీఎంకే ఇచ్చిన పిలుపుమేరకు ధర్మపురిలో శుక్రవారం నిర్వహించిన బంద్ విజయవంతమైంది. రాష్ట్రంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన ధర్మపురిలో రూ.650 కోట్లతో కావేరి మిగులు జలాల పథకం అమలు చేస్తే ఆ జిల్లా అభివృద్ధి చెందగలదని పీఎంకే నాయకులు తెలిపారు. బంద్ సందర్భంగా ధర్మపురి నగరంలోని అన్ని చోటా దుకాణాలను మూసివేశారు. డీఎస్పీ మహేశ్వరన్ బంద్ సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరుగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. హోసూరు - బెంగళూరు మెయిన్‌రోడ్డు తదితర ప్రాంతాలు బంద్ సందర్భంగా నిర్మానుష్యంగా కనిపించాయి. బంద్ విజయవంతమైనట్లు పీఎంకే అధ్యక్షుడు డాక్టర్ అన్బుమణి రాందాస్ ప్రకటించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కావేరి మిగులు జలాల ప్రాజెక్టును అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆస్పత్రి నుంచి రజనీకాంత్ డిశ్చార్జ్

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ ఆస్పత్రి నుంచి శుక్రవారం ఉదయం డిశ్చార్జ్ అయ్యారు. గత సోమవారం అర్ధరాత్రి ఆయన తీవ్ర అస్వస్థతకు లోనుకావడంతో కుటుంబీకులు చెన్నై గ్రీమ్స్ రోడ్డులో ఉన్న అపోలో ఆస్పత్రిలో చేర్పించారు. ఆయన్ని పరీక్షించిన వైద్యులు.. గుండె నుంచి బయటకు వచ్చే ప్రధాన రక్తనాళంలో వాపు ఉన్నట్టు గుర్తించి శస్త్రచికిత్స రహిత వైద్య విధానం ద్వారా స్టెంట్ వేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత రెండు రోజుల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉన్న రజనీకాంత్ పూర్తిగా కోలుకోవడంతో శుక్రవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. రజనీ ఇంటికి వెళ్తున్న సమయంలో ఆస్పత్రి వద్ద గుమికూడిన అభిమానులకు ఆయన రెండు చేతులెత్తి అభివాదం చేస్తూ కారులో వెళ్ళిపోయారు. కాగా, తన ఆరోగ్యం బాగుండాలని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, గవర్నర్ రవి, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఇతర ప్రముఖులు, అభిమానులకు రజనీకాంత్ సామాజిక మాధ్యమాల ద్వారా ధన్యవాదాలు తెలిపారు.

రాష్ట్రంలో తగ్గిన ప్రసూతి మరణాలు

- మంత్రి ఎం.సుబ్రమణ్యం

ప్యారీస్, అక్టోబరు 4: రాష్ట్రంలో ప్రసూతి మరణాల సంఖ్య చాలావరకు తగ్గిందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం పేర్కొన్నారు. తంజావూరు కొత్త బస్టాండ్ సమీపంలోని ఓ కల్యాణ మండపంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రోగ నివారణ అంతర్జాతీయ మహానాడును శుక్రవారం మంత్రి సుబ్రమణ్యం ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యశాఖ నిర్వహణలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరచడంతో పాటు అత్యాధునిక వైద్యపరికరాలు అందుబాటులో ఉంచడం వల్ల ప్రసూతి మరణాల సంఖ్య చాలావరకు తగ్గిందని, జాతీయస్థాయిలో లక్ష మందికి 72గా ఉన్న నేపథ్యంలో, రాష్ట్రంలో గత ఏడాది 46కు తగ్గిందన్నారు. ముఖ్యమంత్రి స్టాలిన్ సూచనల మేరకు రాష్ట్రంలో ప్రసూతి మరణాలు లేని విధంగా మార్పు చేసే ప్రయత్నాలు చేపట్టినట్లు తెలిపారు. ఎగ్మూర్‌లోని చిన్నపిల్లల ఆస్పత్రిలాగే నగరంలో మరో ఆసుపత్రి, తంజావూరులో ఒకటి నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

డెంగ్యూ, మలేరియా వ్యాప్తిని అడ్డుకోవాలి

- ఎడప్పాడి పళనిస్వామి

ప్యారీస్, అక్టోబరు 4: రాష్ట్రంలో వర్షాకాలంలో వేగంగా వ్యాప్తిచెందే డెంగ్యూ, మలేరియా, విషజ్వరాలు అడ్డుకొనేలా ముందుగా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలోని పలు జిల్లాల్లో డెంగ్యూ తదితర విషజ్వరాల బారిన పడిన రోగులు చికిత్స కోసం ప్రభుత్వాస్పత్రులకు వెళ్తున్నారని, అయితే అక్కడ అవసరమైన మందులు అందుబాటులో లేనవి ప్రతిపక్ష నేతగా తాను పలుమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించారని, అయినా దీనిపై ఎలాంటి చర్యలు లేవని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన మందులు, పరికరాలను సరఫరా చేయాలని ఆయన సూచించారు.

నిధుల కేటాయింపులో కేంద్రం సవతి తల్లి ప్రేమ

- సెల్వపెరుందగై

ప్యారీస్, అక్టోబరు 4: రాష్ట్రానికి నిధులు కేటాయించడంలో కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతుందని, ఇందువల్ల బీజేపీని ప్రజలు చీదరించుకొనే పరిస్థితి నెలకొందని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై మండిపడ్డారు. ఆయన శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి మెజార్టీ సీట్లు రాలేదని, అందువల్ల ప్రాంతీయ పార్టీల మద్దతుతో కేంద్రంలో ఏర్పాటైన సంకీర్ణ ప్రభుత్వానికి బీజేపీ సారథ్యం వహిస్తోందని అయితే, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు నిధులు సక్రమంగా కేటాయించకపోవడం ఖండించదగ్గదని తెలిపారు. రాష్ట్రప్రభుత్వ విద్యాశాఖకు 2024-25 సంవత్సరానికి రూ.3,586 కోట్ల మేర నాలుగు విడతలుగా మంజూరు చేయాల్సి ఉందని అయితే, ఒక్క విడత కూడా ఇప్పటివరకు కేటాయించలేదని ఆరోపించారు. ఈ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వ పలుమార్లు ఒత్తిడి చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని సెల్వపెరుందగై తెలిపారు.

తండ్రి పేరిట ఆలయం నిర్మించిన సమాజ సేవకుడు



ఆలయాన్ని నిర్మించిన మణిమారన్

వేలూరు, అక్టోబరు 4: తిరువణ్ణామలై సమీపం తలయాంపల్లి గ్రామానికి చెందిన పాండురంగన్-రాజేశ్వరి దంపతుల కుమారుడు మణిమారన్ సమాజ సేవకుడు. అనాథలు, ఆస్పత్రుల్లో గుర్తుతెలియని మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తుంటారు. 16 సంవత్సరాలుగా తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో 2,955 మృతదేహాలకు తన సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన సేవలు అభినందించిన సినీ నటుడు రజనీకాంత్ రూ.10 లక్షల విలువైన అంబులెన్స్ ఉచితంగా అందజేశారు. ఈ నేపథ్యంలో, ఈ ఏడాది జూలై 8న పాండురంగన్ మృతిచెందాడు. తండ్రి జ్ఞాపకంగా ఈశ్వరాలయం నిర్మించాలని మణిమారన్ నిర్ణయించారు. కాశి నుంచి శివలింగాన్ని తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి గత నెల 2వ తేది మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ వేడుకల్లో సినీనటుడు రాఘవ లారెన్స్ ఆయన తల్లి కన్మణి పాల్గొన్నారు. ఈ క్రమంలో, ఆలయంలో సంప్రదాయ పూజలు, యాగాలు నిర్వహించి ప్రజల సందర్శనార్థం శుక్రవారం ఆలయాన్ని తెరిచారు. ఆలయానికి వచ్చిన 500 మందికి పైగా భక్తులకు చీరలు, దోవతులు అందజేసి అన్నదానం నిర్వహించారు.

నవరాత్రి పూజల్లో అర్ధరాత్రి అఘోరాలు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి అరియమంగళం ప్రాంతంలోని జయ అఘోరీ కాళికాదేవి ఆలయంలో నవరాత్రి పూజలు అట్టహాసంగా ప్రారంభయమయ్యాయి. ఆ ఆలయాన్ని కాశీనగరంలో కఠోర శిక్షణ పొందిన అఘోరా గురువు మణికంఠన్ నిర్వహిస్తున్నారు. ఈ ఆలయంలో శని, అమావాస్య, పౌర్ణమి, అష్టమి తదితర విశేష దినాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ యేడాది నవరాత్రి పూజలు గురువారం రాత్రి ప్రారంభమయ్యాయి. ఆ సందర్భంగా ఆలయంలోని జయ అఘోరీ కాళి సమయపురం మారియమ్మన్ అలంకారంతో భక్తులను అనుగ్రహించారు. ఆ తర్వాత అర్ధరాత్రి అఘోరాలు వళ్లంతా విభూతి పూసుకుని ప్రత్యేక యాగాలు జరిపారు. అర్ధరాత్రి జరిపిన మహారుద్రయాగంలో అఘోరా గురువు మణికంఠన్ యాగపూజ నిర్వహించారు. ఈ వేడుకలలో పాల్గొనేందుకు మహిళా అఘోరీలు, వివిధ జిల్లాల నుండి, ఉత్తరాది నుండి పెద్ద సంఖ్యలో అఘోరీలు తరలివచ్చారు.

ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ.500 కోట్ల మోసం!

- చెన్నై యువకుడి అరెస్టు



శివరామ్ జయరామన్

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది ముఠాతో కలిసి నకిలీ మొబైల్ యాప్ సంస్థ నెలకొల్పి వేలాదిమందిని మోసగించిన కేసులో చెన్నై వాషర్‌మెన్‌పేటకు చెందిన శివరామ్ జయరామన్ (30)ను ఢిల్లీ పోలీసులు ఇటీవల అరెస్టు చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని నోయిడాలో ఉత్తరాది మోసగాళ్లతో కలిసి శివరామ్ జయరామన్ హైబాక్స్ పేరిట ఓ సంస్థ నెలకొల్పి ప్రముఖ యూట్యూబర్లు, సినీనటులతో ఆకర్షణీయమైన ప్రకటనలు చేసి సుమారు రూ.500 కోట్ల మేరకు డిపాజిట్లు వసూలు చేసి మోసగించినట్లు ఆరోపణలున్నాయి. తొలుత డిపాజిట్ చేసినవారిలో కొందరికి నిర్ణీత వ్యవధిలో డబ్బులు తిరిగి చెల్లించడం, వారికి అందమైన కానుకలు ఇవ్వడంతో ఆ సంస్థపై నమ్మకం ఏర్పడి వేలాదిమంది హైబాక్స్‌లో డిపాజిట్‌చేశారు. ఆ తర్వాత ఉన్నట్టుండి డిపాజిట్‌దారులకు నగదు, వడ్డీ చెల్లింపులు ఆగిపోయాయి. తమ యాప్‌లో, సంస్థలో సాంకేతిక లోపాలు ఏర్పడ్డాయని, అవన్నీ చక్కదిద్దిన తర్వాత డబ్బులు చెల్లిస్తామంటూ శివరామ్ తదితరులు ప్రకటించారు. రెండు మూడు నెలలు దాటిన హైబాక్స్, మొబైల్ యాప్ పనిచేయకపోవడంతో డిపాజిటర్లు మోసపోయినట్లు నిర్ధారించుకుని ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందులో కీలకపాత్ర వహించిన శివరామ్ ప్రస్తుతం కటకటాలపాలయ్యాడు. అతడి బ్యాంకులలోని రూ.18 కోట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మోసాలకు పాల్పడిన హైబాక్స్‌కు మద్దతుగా ప్రచారం చేసిన ప్రముఖ యూట్యూబర్ ఎల్విష్ యాదవ్, హాస్యనటి భారతి సింగ్ ను కూడా పోలీసులు విచారణ జరుపుతున్నారు. శివరామ్‌పై సమాచార సాంకేతిక చట్టం ప్రకారం కేసు నమోదుచేశారు.

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ తనిఖీ



తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, అక్టోబరు 4: స్థానిక అడుక్కంపారైలోని ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రిని శుక్రవారం జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి పరిశీలించారు. ఔట్ పేషంట్ల విభాగం, టోకెన్ల గది ఇతర విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆసుపత్రి రోజూ వస్తున్న రోగుల సంఖ్య, ఇన్‌పేషంట్లు, సిబ్బంది అటెండెన్స్ తదితరాలను తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట వైద్యశాఖ అధికారి ఇన్బరసు, సిబ్బంది ఉన్నారు.

ఖద్దరు దుస్తుల విక్రయాలు ప్రారంభం... : స్థానిక కోట ఎదురుగా ఉన్న సారథి మాలిగైలో సర్వోదయ సంఘ ఆధ్వర్యంలో ఖద్దరు దుస్తుల విక్రయాలను కలెక్టర్ ప్రారంభించారు. వేలూరు ఎమ్మెల్యే కార్తికేయన్, కార్పొరేషన్ మేయర్ సుజాత, వేలూరు తహసీల్దార్ బాలసుబ్రమణి, 2వ మండల కమిటీ అధ్యక్షుడు నరేంద్రన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొండ ప్రాంతాల్లో 2.75 లక్షల విత్తన బంతులు



విత్తన బంతులు విసిరేస్తున్న సమాజ సేవకులు

వేలూరు, అక్టోబరు 4: నగరం సమీపంలోని కొండ ప్రాంతాల్లో శుక్రవారం 2.75 లక్షల విత్తన బంతులు విసిరే కార్యక్రమం జరిగింది. జిల్లాలోని పర్యావరణాన్ని పెంచేలా సమాజ సేవకుడు దినేష్ శరవణన్ కొండ ప్రాంతాల్లో 5 లక్షల విత్తన బంతులు విసిరే కార్యక్రమం చేపట్టారు. ఆ ప్రకారం, శుక్రవారం కందనేరి కొండ, కండిబేడు కొండలు, జిట్టపల్లి కొండలు, తుత్తికాడు కొండలు సహా పలు కొండ ప్రాంతాల్లో 2.75 లక్షల విత్తనాలు బంతులు విసిరివేశారు. కార్యక్రమంలో కాట్పాడి తహసీల్దార్ జగన్ సహా సమాజసేవకులు పాల్గొన్నారు.

నగ అప్పగించిన చిన్నారులకు ప్రశంస



గొలుసు అప్పగించిన చిన్నారులు

పెరంబూర్, అక్టోబరు 4: ఉడుమలై సమీపంల ఆనైమలై పులుల శరణాలయంలోని అమరావతి మొసళ్ల పార్క్ సందర్శనకు పర్యాటకులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో, కేరళ రాష్ట్రం త్రిశూర్‌కు చెందిన ఓ పర్యాటకుడు ఈ పార్క్ వద్ద 3 సవర్ల నగ పోగొట్టుకున్నాడు. ఈ విషయమై బాధితుడు అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో, పార్క్ చూసేందుకు వచ్చిన శరవణగిరి, ప్రహదీష్‌లకు ఆ నగ దొరికింది. ఆ ఇద్దరు బాలురు నగను అటవీ శాఖ అధికారులకు అప్పగించారు. పిల్లల నిజాయితీని అధికారులు ప్రశంసించారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకు ఆరు నెలలుగా రెక్కీ

- చార్జిషీటులో వెల్లడి



ఆమ్‌స్ట్రాంగ్ (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, అక్టోబరు 4: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్‌ను హతమార్చేందుకు ఆరు నెలల పాటు రెక్కీ ఆపరేషన్ జరిగిందని పోలీసులు ఎగ్మూర్ కోర్టులో దాఖలుచేసిన చార్జిషీటులో పేర్కొన్నారు. పెరంబూర్‌లో జూలై 5వ తేది ఆమ్‌స్ట్రాంగ్ దారుణహత్యకు గురైన సంగతి తెలిసిందే. పాతకక్షల కారణంగా ఈ హత్య జరిగిందని వెల్లడించిన పోలీసులు, ఈ వ్యవహారంలో ఉత్తర చెన్నై రౌడీ షీటర్ నాగేంద్రన్ సహా 28 మందిని అరెస్ట్ చేసి కోర్టు ఉత్తర్వుల మేరకు పుళల్ జైలుకు తరలించారు. వీరిలో 25 మందిపై గూండా చట్టం ప్రయోగించిన నేపథ్యంలో, ఈ హత్య దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఎగ్మూర్ కోర్టులో సుమారు 5 వేల పేజీల చార్జిషీటు దాఖలుచేశారు. అందులో... ఆమ్‌స్ట్రాంగ్‌ను హత్య చేసేందుకు ఆరు నెలలుగా రెక్కీ ఆపరేషన్ జరిగినట్లు తెలిసింది. అలాగే, 300 మంది సాక్ష్యులను చార్జిషీటులో చేర్చారు. నిందుతులకు సంబంధించి 63 బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేయడంతో పాటు ఆ ఖాతాల నుంచి రూ.2.30 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు చార్జిషీటులో పొందుపరిచారు.

నిషేధిత ఉగ్రవాద సంస్థకు మద్దతు సేకరించిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, అక్టోబరు 4: దేశంలో నిషేధించిన హిస్బుత్ తహీర్ అనే ఉగ్రవాద సంస్థకు మద్దతు సేకరించిన నగరానికి చెందిన వ్యక్తిని అరెస్ట్ చేశారు. తండయార్‌పేట నేతాజీ నగర్‌కు చెందిన రహీమ్ ఉగ్రవాద సంస్థలో సభ్యులుగా కొందరిని చేర్పించే ప్రయత్నాలు చేసాడనే సమాచారంతో ఆర్కే నగర్ పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు. రహీమ్ ఉత్తర చెన్నైలో దర్గా, మసీదులకు ప్రార్థనలకు వెళ్తున్న వారిని ఉగ్రవాద సంస్థలో చేరాలని కోరుతున్నట్లు, అయితే దీనికి మసీదు, దర్గా నిర్వాహకులు అభ్యంతరం తెలిపారని పోలీసుల విచారణలో తేలింది. అంతేకాకుండా, వినాయక చవితి సందర్భంగా హిందువులకు శుభాకాంక్షలు తెలిపిన కొంతమంది ముస్లింలను హత్యచేస్తానని రహీమ్ బెదిరించినట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో, గురువారం రాత్రి తండయార్‌పేటలో ఉన్న ఆయన ఇంటికెళ్లిన పోలీసులు అరెస్ట్ చేసి సంబంధిత ఉగ్రవాద సంస్థకు మద్దతుగా ముద్రించిన పుస్తకాలు స్వాధీనం చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

సెల్‌ఫోన్ చూడొద్దని మందలించిన తల్లి

- కుమార్తె ఆత్మహత్య

ప్యారీస్, అక్టోబరు 4: స్థానిక తిరువేర్కాడులో ఎక్కువ సేపు సెల్‌ఫోన్ చూడొద్దని తల్లి మందలించడంతో కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని పోలీసులు తెలిపారు. బీహార్ రాష్ట్రానికి చెందిన రణవీర్ ప్రసాద్-సరితాదేవి దంపతుల కుమార్తె శాంతకుమారి (18) ప్లస్ టూ చదువుతోంది. ఇంట్లో ఎక్కువ సేపు సెల్‌ఫోన్ వినియోగిస్తున్న కుమార్తెను తల్లి మందలించినట్లు తెలిసింది. అందువల్ల మనస్తాపం చెందిన శాంతకుమారి గురువారం ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం తెలిసి అక్కడకు చేరుకున్న తిరువేర్కాడు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుచ్చిలో 6 స్కూళ్లకు బాంబు బెదిరింపు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి నగరంలో శుక్రవారం ఉదయం ఆరు పాఠశాలలు, రెండు కళాశాలలకు ఈమెయిల్ సందేశాల ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. గురువారం ఆనగరంలోని తొమ్మిది పాఠశాలలు, రెండు కళాశాలలకు ఇదే రీతిలో బాంబు బెదిరింపులు రావటంతో ఆ విద్యా సంస్థలన్నింటిలోనూ పోలీసులు, బాంబ్‌స్క్వాడ్ తనిఖీ చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆ నగరంలోని ఆరు స్కూళ్లు, రెండు కాలేజీలో బాంబులు పేలనున్నాయని ఈమెయిల్ సందేశాలు వచ్చాయి. పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు తీవ్ర తనిఖీలు చేసి అవన్నీ ఉత్తుత్తి బాంబు బెదరింపులని నిర్ధారించారు.

ఆటోను ఢీకొన్న లారీ.. ముగ్గురి మృతి



మృతి చెందిన యువకులు (ఫైల్‌ఫొటో)

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లా కులశేఖరపట్టినం దసరా వేడుకల ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొని స్వస్థలానికి తిరిగి వెళ్తున్న ముగ్గురు యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మరో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. తూత్తుకుడి సమీపం ముడివైత్తానేందల్ చెక్కారపట్టి ప్రాంతానికి చెందిన 15 మంది భక్తులు కులశేఖరపట్టినం ముత్తారమ్మన్ ఆలయ వేడుకల్లో పాల్గొని శుక్రవారం గూడ్సు ఆటోలో స్వస్థలానికి బయలుదేరారు. ఉడన్‌కుడి విద్యుత్ కేంద్రం సమీపంలో వెళ్తుండగా అలంకుళం నుండి కులశేఖరపట్టినం వైపు వెళ్తున్న లారీ అదుపు తప్పి ఢీకొనడంతో గూడ్సు ఆటోలో పూర్తిగా నుజునుజ్జయ్యింది. ఆటోలో ప్రయాణించిన పెరుంపడయాన్ (20), కృష్ణపెరుమాళ్ (25), వడివేల్ (17) అనే ముగ్గురు యువకులు ఘటనా స్థలంలో మరణించారు. ఆటో డ్రైవర్ సుడలైవీరన్, సుబ్రమణి, మాయాండి, అయ్యంపెరుమాళ్, అరుణాచలం సహా పది మంది తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కులశేఖరపట్టినం పోలీసులు కేసు నమోదు చేసుకుని లారీ డ్రైవర్ మారియప్పన్ (38)ని అరెస్టు చేశారు.

● ధ్వజారోహణంతో మొదలైన సాలకట్ల బ్రహ్మోత్సవాలు ● శ్రీవారికి సీఎం చంద్రబాబు పట్టువస్త్రాల సమర్పణ ● కళాబృందాల ఆటపాటలతో అంబరాన్నంటిన సంబరాలు

ఆరంభం ఆదిదేవుని మహోత్సవం



బంగారు ధ్వజస్తంభం మీద గరుడపతాకం రెపరెపలాడింది. ముక్కోటి దేవతలను, అష్టదిక్పాలకులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ గరుడుడు ప్రకటన చేశాడు. మంగళవాద్యాల నడుమ, వేదగానాల మధ్య శుక్రవారం సాయంత్రం ధ్వజారోహణం వైభవంగా సాగింది. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీసమేతంగా సంప్రదాయబద్ధంగా స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పెద్దశేష వాహనసేవలో పాల్గొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచీ వచ్చిన 14 బృందాలు మాడవీధుల్లో ప్రదర్శించిన కళావిన్యాసాలు భక్తులను మురిపించాయి.

మెరీనాలో సత్తాచాటిన వైమానిక దళం

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): భారత వైమానిక దళం 92వ వార్షికోత్సవాల సందర్భంగా శుక్రవారం ఉదయం నిర్వహించిన చివరి రిహార్సల్స్ చూపరులకు గగుర్పాటు కలిగించాయి. భారత వైమానిక దళం సభ్యుల ప్రతిభాపాటవాలకు నిలువెత్తు అద్దంలా మెరీనా తీరంలో బుల్లి విమానాల పల్టీలు, భూమి దద్దరిల్లేలా మిగ్ విమానాల శబ్దాలు, ఆకాశంలో త్రివర్ణ రంగవల్లులు వేసిన విమానాలు, మువ్వన్నెల పతకాన్ని గొడుగులా పట్టుకుని హెలికాప్టర్ నుంచి కిందకు దూకిన సైనికులు ఇలా అడుగడుగునా సాహసకృత్యాలను నగరవాసులు ఎండవేడి పడకుండా గొడుగులు పట్టుకుని మరీ వీక్షించారు. దీంతో మెరీనా తీరం అంతా రంగురంగుల గొడుగులే కనిపించాయి. రెండు రోజుల రిహార్సల్స్‌లో పూర్తిస్థాయిలో విమానాలు, హెలికాప్టర్లు పాల్గొనలేదు. అయితే శుక్రవారం ఉదయం 11 నుండి మధ్యాహ్నం 2 గంటల దాకా ఆదివారం ఎయిర్‌షోలో పాల్గొననున్న వైమానిక దళం విమానాలు, హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, డకోటా విమానాలు, రఫేల్ విమానాలు అంటూ అన్ని రకాల వాయుసేన సంపదనంతా విన్యాసాలకు వినియోగించారు. దీంతో నగరవాసులకు ముందే పూర్తిస్థాయి ఎయిర్‌షోను చూసే భాగ్యం కలిగింది. సైనికుల పారాచూట్ల విన్యాసాలు సైతం అబ్బురపరిచాయి. యుద్ధ విమానాలు చేసిన శబ్దాలకు నగరవాసులంతా చెవులు మూసుకోవాల్సి వచ్చింది. ఈ ముందస్తు పూర్తిస్థాయి ఎయిర్‌షో విన్యాసాలను చూడటానికి ఉదయం తొమ్మిది గంటల నుండే నగరవాసులంతా మెరీనా తీరానికి చేరుకున్నారు. తిరువళ్లూరు, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ నుండి ఈ ఎయిర్‌షోను వీక్షించడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ విన్యాసాలను వీక్షించినవారంతా మూడు గంటలపాటు తామెక్కడో యుద్ధభూమిలో ఉన్నంత ఫీలింగ్ కలిగిందని చెప్పారు.



మువ్వన్నెల పారాచూట్‌తో కిందకు దిగుతున్న సాహసికుడు



మిగ్ విమానం విన్యాసం




పెద్ద విమానం రెండు బుల్లి విమానాలను తాడుతో లాగుతున్న రీతిలో విన్యాసం





రంగులు వెదజల్లుతున్న విమానాలు - పరస్పరం ఢీకొట్టుకునేలా ఎగురుతున్న హెలికాప్టర్లు



బీచ్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

సముద్రతీరంలో వాయుసేన హెలికాప్టర్ల విన్యాసం

బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మడం తప్పు



అవగాహనా ప్రచారంలో ఆస్పత్రి సిబ్బంది

అడయార్, అక్టోబరు 4: ప్రజారోగ్యం, పరిశుభ్రతను పెంపొందించే బృహత్తర కార్యంలో భాగంగా నగరంలోని మెడ్‌వే హాస్పిటల్ వినూత్న ప్రచార, అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టింది. 'బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయడం తప్పు' (స్పిట్టింగ్ ఈజ్ రాంగ్) అనే పేరుతో అవగహనా ప్రచారాన్ని చేపట్టింది. దీన్ని మరింత ప్రచుర్యం కల్పించేలా రాష్ట్ర ఆరోగ్య మంత్రి ఎం సుబ్రహ్మణ్యం ఒక వీడియో సందేశాన్ని కూడా విడుదల చేశారు. బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం వల్ల కలిగే అనారోగ్య సమస్యలను ఆయన తన వీడియో సందేశంలో వివరించారు. అదేసమయంలో ప్రజారోగ్యంపై మెడ్‌వే హాస్పిటల్ చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. కాగా, ప్రచార కార్యక్రమంలో హాస్య నటుడు యోగిబాబు, దర్శకుడు వెంకట్ ప్రభు, నటులు షైమ్ గోపి, విచ్చు విశ్వనాథన్, సుబ్బు పంచు, నటి దేవదర్శిని, బుల్లి తెర నటుడు గోపినాథ్ తదితరులతో రూపొందించిన ప్రచార యాడ్‌లను ప్రదర్శిస్తున్నారు.



శుక్రవారం చెన్నై మైలాపూరులో నవరాత్రి బొమ్మల కొలువును ప్రారంభించి వీక్షిస్తున్న దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు



చెన్నై వడపళని మురుగన్ ఆలయంలో నవరాత్రి సందర్భంగా ఏర్పాటైన బొమ్మల కొలువు

ఆళ్వార్‌పేటలో మెహతా జ్యూవెలరీ షోరూమ్



షోరూమ్ ప్రారంభోత్సవంలో నిర్వాహకులు

అడయార్, అక్టోబరు 4: చక్కటి హస్తకళ, విలాసవంతమైన ఆభరణాల తయారీలో పేరెన్నికగన్న మెహతా జ్యూవెలరీ ఆళ్వార్‌పేటలోని కస్తూరి రంగన్ రోడ్డులో శుక్రవారం మరో షోరూమ్ ప్రారంభించింది. ఈ షోరూమ్‌లో కొనుగోలుదార్లకు సరికొత్త అనుభూతినిచ్చేలా డిజైన్ చేశారు. ప్రారంభోత్సవంలో స్టార్ హెల్త్ ఇన్స్యూరెన్స్ మాజీ సీఎండీ వి.జగన్నాథన్, లివియా పాలిమర్స్ ఛైర్మన్ బీవీ రమణ, భారత్ డైమండ్స్ బోర్స్ ప్రెసిడెంట్ అనూప్ మెహతా, వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ రీజినల్ సీఈవో సచిన్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

వీఐటీలో 'బయో సమ్మిట్' ప్రారంభం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

వేలూరు, అక్టోబరు 4: స్థానిక వీఐటీ యూనివర్సిటీలో రెండు రోజుల 'బయో మెట్రిక్' సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభ కార్యక్రమానికి వర్సిటీ ఉపాధ్యక్షులు సెల్వం అధ్యక్షత వహించగా, సదస్సు ఆర్గనైజర్ జయరామన్ ఆహ్వానం పలికారు. ముఖ్యఅతిథిగా తమిళనాడు సైన్స్ టెక్నాలజీ సెక్రటరీ విన్సెంట్ సదస్సు ప్రారంభించి మాట్లాడుతూ... యూనివర్సిటీలు, పరిశ్రమలు కలిసి పనిచేయాలన్నారు. దేశంలో ప్రతి ఏడాది 80 వేల మంది రీసెర్చిలను నమోదుచేస్తుండగా, రాష్ట్రంలో 7,500 మంది రీసెర్చి నమోదుచేస్తున్నారని తెలిపారు. విద్యార్థులు కొత్త పరిశోధనలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కేంద్ర ప్రభుత్వ ఫుడ్ ఫ్యాక్టరీ డైరెక్టర్ సానుజేకబ్, వీఐటీ డీన్ శివ తదితరులు పాల్గొన్నారు. సదస్సులో భాగంగా నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

'విజయ్-69' చిత్రం ప్రారంభం

● నేటినుంచి చిత్రీకరణ



పూజా కార్యక్రమంలో విజయ్ - పూజా హెగ్డే తదితరులు

చెన్నై, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): తమిళ అగ్రహీరో విజయ్ నటించే 69వ చిత్రం శుక్రవారం సంప్రదాయ పూజా కార్యక్రమంతో చెన్నైలో ప్రారంభమైంది. కేవీఎన్ ప్రొడక్షన్ పతాకంపై నిర్మాత వెంకట్ కె.నారాయణ భారీ బడ్జెట్‌తో నిర్మించే ఈ చిత్రానికి హెచ్.వినోద్ దర్శకుడు. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ హీరోగా నటించిన 'ది గోట్' చిత్రం ఘన విజయం సాధించిన విషయం తెల్సిందే. ఇప్పుడు విజయ్ తన 69వ చిత్రాన్ని హెచ్.వినోద్ దర్శకత్వంలో రూపొందించనున్నారు. ఇంకా పేరు పెట్టని ఈ చిత్రంలో హీరోయిన్లుగా పూజా హెగ్డే, మమితా బైజులను ఎంపిక చేయగా, ఇతర పాత్రల్లో బాబీ డియోల్, గౌతం వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, ప్రియమణి, నరేన్, ప్రసన్న, తదితరులు నటించనున్నారు. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం. తొలి షెడ్యూల్ శనివారం నుంచి పాట సీక్వెన్స్‌తో ప్రారంభిస్తున్నారు. వచ్చే యేడాది అక్టోబరు నెలలో ఈ చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేశారు. కాగా, ఈ చిత్రం ప్రారంభోత్సవ పూజా కార్యక్రమానికి అనేక మంది సినీ ప్రముఖులు హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు.



సచివాలయంలో ప్రముఖ కవి ఎం.మేత్తాకు కలైంజర్ స్మారక కళారంగ దిగ్గజ అవార్డు ప్రదానం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్



చెన్నైలో రాష్ట్ర వ్యాయామ క్రీడా విశ్వవిద్యాలయం 15వ స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టా ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి



కేంద్ర ప్రభుత్వం నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న వేలూరు జిల్లా రాజకుప్పం మాధ్యమిక పాఠశాల ఉపాధ్యాయుడు గోపీనాథ్ శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను తన కుటుంబ సభ్యులతో కలిసి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.